ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 155 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 13 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## మోడీ నేతృత్వంలో ఢిల్లీ డిక్లరేషన్‌కు
# ఏకగ్రీవ ఆమోదం




గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశంలో కీలక పాత్ర పోషించాలి

బ్రిక్స్ సభ్య దేశాల కోసం సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) అవసరం

బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించాలి

గ్లోబల్ మిలిటరీ ఖర్చులు పెరిగి పోవడం పట్ల విచారం

డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ

పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం

హాజరైన 21 దేశాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ..మిగతా 2లో



## ధరణిలో 23 వేల ఎకరాల
# అక్రమాలు

**భూములను కొల్లగొట్టకూడదనే చట్టం**

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి..

22ఏపై అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ

ఈనెల 16కు శాసనసభ వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గ్గా మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో

..మిగతా 2లో

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు.. గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష**



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన

..మిగతా 2లో

# దసరాకు
# కొత్త పింఛన్ల పంపిణీ

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు

2

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

కొండా సురేఖ తొలగింపుపై తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు

తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహించిన బీఆర్ఎస్

సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు

మాజీ మంత్రి కొండా సురేఖ తొలగింపుపై తలసాని సెటైర్లు

100 రోజుల హామీల అమలుపైనా చురకలు అంటించిన బీఆర్ఎస్

అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా ఈ కార్యక్రమం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల ..మిగతా 2లో

## 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల
# ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం

**శ్రీధర్ బాబు**

హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు

దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి

హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ యాక్ట్- 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' ..మిగతా 2లో

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం: కిషన్ రెడ్డి



రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి

ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి

డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ..మిగతా 2లో

# మోడీ నేతృత్వంలో ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం

**మొదటి పేజీ తరువాయి...**

ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ






ఢిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ ఢిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని ఢిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది. వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది.

అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూఢిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ


**మొదటి పేజీ తరువాయి...**

అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

# ధరణిలో 23 వేల ఎకరాల అక్రమాలు

**మొదటి పేజీ తరువాయి...**

వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత



భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఆషామాషీగా తీసుకురాలేదని.. దాదాపు 18 రాష్ట్రాల్లోని అధికారులు అధ్యయనం చేశాక..ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూ భారతికి రూపకల్పన చేశామని స్పష్టం చేశారు. భూభారతి ఎన్ ఐసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే పారదర్శకంగా నడుస్తుందని తెలిపారు. అలాగే 22ఏ నిషేధిత భూముల అంశంపై మాట్లాడుతూ.. 2023 నాటికి 22 ఏ జాబితాలో కోటి 2 లక్షల 52 వేల 690 ఎకరాలకు సంబంధించిన వివరాలను సభ ముందు ఉంచారు మంత్రి పొంగులేటి. వీటిలో అటవీ, అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్ హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరం కూడా చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు. గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభకు వివరించారు. 22ఏలోని ప్రభుత్వ వ్యవసాయ భూములు 96,36,777 ఎకరాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు వ్యవసాయ భూమి 3,73,930 ఎకరాలు ఉందని వివరించారు. వ్యవసాయేతర భూమి 1,94,543 ఎకరాలున్నట్లుగా సభలో వివరించారు. ఇవి కాకుండా ఎండోమెంట్ భూములు 5,12,792 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి, ఇప్పటికి నిషేధిత జాబితాలోని భూమి 47,440 ఎకరాలు తగ్గిందని పొంగులేటి తెలిపారు. 23వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇచ్చామన్నారు. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి మరో 20వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాల్లో ప్రతి ఎకరాకు లెక్కలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ చెప్పిందని పొంగులేటి గుర్తుచేశారు. కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు.వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.




# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**మొదటి పేజీ తరువాయి...**

భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుందిని ఆయన స్పష్టం చేశారు. ద్యూ టిడ్87 వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## 2034 నాటికి

## 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే

# తెలంగాణ లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (+జజ) ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు. ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం: కిషన్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జీఖూా) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (×ూఖీ) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# వినాయక విగ్రహాల నిమజ్జనాలకు రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ పత్తి కుంట (వినాయక్ సాగర్) సిద్ధం



వినాయక కొలను



షెడ్డు వద్ద అధికారులు, నాయకులు

### పత్తి కుంట వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణం - జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

**బుద్వేల్ , సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం) :**

వినాయక నిమజ్జనోత్సవాల కు పత్తి కుంట సిద్ధమైంది. పత్తి కుంట వద్ద వినాయక కొలను ముస్తాబు చేశారు. చెరువు వద్ద రూ. 12 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేశారు. షెడ్డు ను శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, గణేష్ ఉత్సవ సమితి నాయకులతో కలిసి ప్రారంభించారు. భక్తులు, అధికారులు నిలబడటానికి ప్రతి సంవత్సరం తాత్కాలిక టెంట్ లు , షామియానాలు వేసే చోట ఈ సంవత్సరం రూ. 12 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం చేసినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి లు తెలిపారు. పత్తి కుంట మంచినీటి చెరువని ఈ చెరువు లో ప్రతి సంవత్సరం వేలాది వినాయకుల నిమజ్జనాలు జరుగుతుంటాయని తెలిపారు. పత్తి కుంట వినాయక కొలను వద్ద విద్యుత్ దీపాలు, క్రేన్ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, నిమజ్జనం జరిగే వినాయక ప్రతిమలను ఎప్పటికప్పుడు తొలగించడం లాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారజరుపుకోవాలన్నారు. వినాయక చవితి, నిమజ్జోనోత్సవాలను ప్రజలు, భక్తులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు



పత్తి కుంట వద్ద ఏర్పాటు చేసిన షెడ్డు ను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి లు

ప్రశాంతంగా జరిగేటట్లు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి, జోనల్ ఈఈ నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్ ఏ సీ పీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ వెంకటేష్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధి లు వై. శ్రీధర్ , సామా ఇంద్రపాల్ రెడ్డి, కోలన్ సుభాష్ రెడ్డి, మ్యాడమ్ రామేశ్వర్ రావు, చెట్టిగారి నరేందర్ రావు, బొక్క బాల్ రెడ్డి, ఎన్ మల్లారెడ్డి, పడమటి శ్రీధర్ రెడ్డి, ఎస్ విజయ్ కుమార్, పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, ఎన్ ధనుంజయ, ఈ వేణు గోపాల్, పెంద్యాల సాయి మల్లిక్ , గుంజ బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు దివంగత కె లక్ష్మణచారి

### ఈ నెల 18న లక్ష్మణ చారి వర్ధంతి

**బుద్వేల్, సెప్టెంబరు 12 (ప్రభాత ఉదయం) :**



కామ్రేడ్ లక్ష్మణాచారి

ప్రజల కోసం పోరాడిన నాయకుడు మరణించినా, ఆయన పేరు, చేసిన పనులు చిరకాలం గుర్తుండిపోతాయనడానికి నిలువెత్తు నిదర్శనంగా హైదరూడ కు చెం దిన సీపీఐ నాయకులు దివంగత కె లక్ష్మణాచారి అని చెప్ప వచ్చు. ఆయన పేరు ను శంషాబాద్ మం డలం ధర్మగిరి రోడ్డు లో వెలసిన కాలనీ కి కె ఎల్ చారి నగర్ గా పెట్టుకున్నారంటే ఆయన పేద ప్రజలకోసం చేసిన పోరాటం ఎట్టిదో తెలుసుకోవచ్చు. ఈ నెల 18న కె లక్ష్మణ చారి వర్ధంతి నేపధ్యంలో కె ఎల్ చారి నగర్ ప్రజలు ఆయన వర్ధంతి ని చేయడానికి సన్నహాలు చేస్తున్నారు. 1956 జూలై 10వ తేదీన రాజేంద్రనగర్ హైదరరీడ కు చెందిన కె బ్రహ్మయ్య, దేవకమ్మ ల మూడవ సంతానం గా జన్మిం చిన కె లక్ష్మణాచారి 25 సంవత్సరాల పాటు సీపీఐ పార్టీలో పనిచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రం గారెడ్డి జిల్లా కార్యదర్శిగా, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా ఆయన పార్టీ కోసం సేవలందించారు. మొదట్లో

ఆయన కార్వాన్ శాఖ లో సీపీఐ నాయకులుగా పనిచేశారు. అనంతరం రాజేంద్రనగర్ మండలంలో చురుకైన నాయకునిగా సేవలందించారు. 1999 సెప్టెంబరు 18వ తేదీన సీపీఐ చేవెళ్ల నియోజకవర్గం అభ్యర్థిగా పోటీలో ఉన్న సీపీఐ నాయకులు పి శ్రీనివాసులు నాయుడు ప్రచారం కోసం నిర్వహించిన బైక్ ర్యాలీలో పార్టీ నాయకులు మూర్తి తో కలసి పాల్గొనగా జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మణాచారి మరణిం చారు.

**ఆయన పేరుతో కె ఎల్ చారి నగర్ ఏర్పాటు**

కె లక్ష్మణాచారి బ్రతికున్న కాలంలో పేదల కోసం, పేదల ఇండ్ల స్థలాల కోసం విశేషంగా కృషి చేశారు. శం షాబాద్ మండలం లోని పేదలకు ధర్మగిరి రోడ్డు లో ఉన్న ప్రభుత్వ భూమిలో 300 ఇండ్లు ఇప్పించడంలో కష్టపడి పనిచేశారు. లక్ష్మణాచారి మరణానంతరం ఆ ప్రాంతానికి కె ఎల్ చారి నగర్ అని నామకరణం చేశారు. నేటికి ఆ బస్తీ ప్రజలు లక్ష్మణ చారి ని గుర్తు చేసుకుంటు మా దేవుడు లక్ష్మణాచారి అని చెప్పు కు ంటారు.

**25 సంవత్సరాల పాటు సీపీఐ కోసం పనిచేశారు : సీపీఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు**

హైదర్ గూడ కు చెందిన కె లక్ష్మణాచారి 25 సంవత్సరాల పాటు సీపీఐ లో పనిచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఆయన సేవలందించారు. పార్టీలో రాష్ట్ర సమితి సభ్యులుగా కొనసాగారు. నాతో కలసి ఆయన పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు.

## ఆల్ ఇండియా యూనివర్శిటీస్ ఎంప్లాయిస్ కాన్ఫడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులుగా సామ అమృత్ రెడ్డి

**బుద్వేల్, సెప్టెంబరు 12 (ప్రభాత ఉదయం)**



సామ అమృత్ రెడ్డి

ఆల్ ఇండియా యూనివర్శిటీస్ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఉద్యోగ సంఘం నాయకులు సామ అమృత్ రెడ్డి ఏకగ్రీవంగా నియమితులైనారు. ఆయన వరుసగా మూడవ సారి ఈ పదవి కి నియమితులైనారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 10వ తేదీ నుం చి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగిన 15వ ఆల్ ఇండియా యూనివర్శిటీస్ ఎంప్లాయిస్ కాన్ఫడరేషన్ జాతీయ సదస్సు లో సామ అమృత్ రెడ్డి ని జాతీయ ఉపాధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉన్నత విద్యారం గ పరిరక్షణ, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఆల్ ఇండియా యూనివర్శిటీస్ ఎంప్లాయిస్ కాన్ఫడరేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తానని అమృత్ రెడ్డి తెలిపారు.



జాతీయ లోక్ అదాలత్ లో పాల్గొన్న న్యాయ మూర్తులు

## రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

### న్యాయమ్మరీర్తి : అపర్ణా దేవి

### జాతీయ లోక్ అదాలత్ లో 3,256 కేసుల పరిష్కారం

**బుద్వేల్, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం) :**

పెండింగ్ లో ఉన్న కేసులు రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా అదనపు జడ్జి అపర్ణా దేవి తెలియజేసారు. ఈ నెల 7 నుండి 12 వరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ కోర్టు భవనముల సముదాయం లో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 3,256 కేసులను పరిష్కరించారు, వాటిలో రాజీ పడిన కేసులు 174, అడ్మిషన్ కేసులు 643, విద్యుత్ చౌర్యం కేసులు 45, సైబర్ క్రైమ్ 21 కేసులు ,డ్రంకన్ డ్రైవ్ 2,331 కేసులు, ఇ-పెట్టి కేసులు 42 పరిష్కరించారు, ఈ కార్యక్రమంలో జడ్జిలు సుచరిత, స్వప్న, నర్మద, నరేష్, ఉదయ్ నాయక్, రత్నకుమారి, వేణుగోపాల్ రెడ్డి, ఏపిపిలు సుజన, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికాంత్ రెడ్డి, కార్యదర్శి నరసింహా చారి, లోక్ అదాలత్ సభ్యులు, శ్రీధర్ రెడ్డి, సుజాత, అనిల్ చారి, తులసిరామ్ నాయక్, రజనీకాంత్ గౌడ్, సోమశేఖర్, ఉష, ప్రవిణ్, సునీత, అస్మ, కోర్టు సిబ్బంది దేవిడ్ రాజ్, మహేందర్, నరేష్ గౌడ్ మరియు న్యాయవాదులు ఇతరులు పాల్గొన్నారు



బాపు ఘాట్ వద్ద ద్విచక్ర వాహనాల కోసం వదిలిన దారి లో కారు

## ద్విచక్ర వాహనాలు వెళ్లే దారిలో వెళ్లడానికి ఇన్నోవా కారు డ్రైవర్ ప్రయత్నం

### బాపుఘాట్ బ్రిడ్జి పై భారీగా నిలచిన ట్రాఫిక్

**బుద్వేల్, సెప్టెంబరు 12 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ బాపుఘాట్ బ్రిడ్జి వద్ద రోడ్డు పనులుజరుగుతున్నాయి. క్యూరింగ్ కోసం ఆ రోడ్డును మూసి వేశారు. వారం రోజులుగా క్యూరింగ్ జరుగుతుంది.ఆ రోడ్డు లో ఓ పక్క ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లడానికి ఓ పక్క కొద్ది స్థలం వదిలారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి వదిలిన ఆ దారి గూండా ఓ ఇన్నోవా కారు డ్రైవర్ వెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో ఆ రోడ్డు లో పూర్తిగా ట్రాఫిక్ స్థంభించిపోయింది. అక్కడున్న వారు కష్టపడి రోడ్డు ను క్లియర్ చేయడం తో సమస్యకు పరిష్కారం లభించింది. సోషల్ మీడియా లో ఇన్నోవా కారు ఫోటోలు, వీడియో లు వైరల్ అయ్యాయి. రోడ్డు పై కారు నడపడం కాదు... బ్రదర్.. కొంచెం బుర్ర కూడా వాడాలి అంటు నెటిజన్లు సదరు డ్రైవర్ పై తీవ్ర స్థాయి లో మండిపడ్డారు.



### కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లిలో ఘనంగా

## గణేష్ ఆగమన్

### గణనాథునికి హారతులతో స్వాగతం పలికిన కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,సెప్టెంబర్12(ప్రభాత ఉదయం)**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్,మైలార్ దేవ్ పల్లి డివిజన్లలో మహాగణపతి ఆగమన్ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.కాటేదాన్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ల చరిత్రలో తొలిసారిగా భారీ స్థాయిలో గణేష్ ఆగమన్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ స్వాగత కార్యక్రమానికి డివిజన్ నాయకులు,కార్యకర్తలు,అధ్యక్షులు ఏర్పాట్లు చేశారు.గత దశాబ్ద కాలంగా కాటేదాన్,మైలార్ దేవ్ పల్లి డివిజన్లలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నేపథ్యంలో వివిధ గణేష్ మండపాలకు తరలివస్తున్న గణనాథులకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై గణనాథునికి హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డివిజన్‌కు చెందిన మహిళలు,పిల్లలు,పెద్దలు,బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణపయ్యకు హారతులు సమర్పించారు.గణనాథుని ఆగమన్ సందర్భంగా కాటేదాన్,మైలార్ దేవ్ పల్లి ప్రాంతం భక్తి వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ "భయపడకండి భక్తులారా...నేను మీతోనే ఉన్నాను.విఘ్నాలను తొలగించే గణపయ్య ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలి.ప్రతి ఇంటా సుఖసంతోషాలు,ఆరోగ్యం,శాంతి నెలకొనాలి.గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో మంచి జరగాలి.భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ ఐక్యతను చాటుకోవాలి" అని ఆకాంక్షించారు.గణేష్ ఆగమన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై గణనాథునికి హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.

## జలమండలిలో మీటర్ రీడర్లను తొలగించడం లేదు పుకార్లను నమ్మవద్దు

### క్రమబద్ధీకరణ అంశంపై ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు

### మంగళవారం ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేక సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

జలమండలిలో ప్రస్తుతం పనిచేస్తున్న మీటర్ రీడర్లలో ఎవరినీ విధుల నుంచి తొలగించడం లేదని, తొలగించే ఉద్దేశం కూడా లేదని జలమండలి స్పష్టం చేసింది. ఈ అంశంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలు, పుకార్లను ఎవరూ నమ్మవద్దని కోరింది.తమను క్రమబద్ధీకరించాలని మీటర్ రీడర్లు కోరుతున్న నేపథ్యంలో, వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని సంబంధిత ప్రతిపాదనలను జలమండలి ఇప్పటికే ప్రభుత్వానికి పంపించింది. వారిని అవుట్‌సోర్సింగ్ విధానంలో కొనసాగించే అంశాన్ని కూడా ప్రతిపాదనల్లో పొందుపరిచింది. ప్రస్తుతం ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపింది.ఈ విషయంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకునేందుకు మంగళవారం ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు జలమండలి వెల్లడించింది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా తదుపరి చర్యలు చేపడతామని పేర్కొంది.మీటర్ రీడర్ల విజ్ఞప్తుల నేపథ్యంలో గతంలో చేపట్టిన టెండర్ల ప్రక్రియను కూడా నిలిపివేసినట్లు తెలిపింది. ఈ అంశానికి సంబంధించిన తదుపరి చర్యల కోసం ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపించినట్లు వివరించింది.

**పెండింగ్ జీతాలపై చర్యలు**

మీటర్ రీడర్లకు సంబంధించిన పెండింగ్ జీతాల విషయంలో కూడా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు జలమండలి తెలిపింది. సంబంధిత ఏజెన్సీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను గురువారం విడుదల చేసినట్లు పేర్కొంది.కొన్ని నెలలకు సంబంధించిన హాజరు వివరాలను ఏజెన్సీలు ఆలస్యంగా సమర్పించడం వల్ల బిల్లుల పరిశీలన, చెల్లింపు ప్రక్రియలో కొంత జాప్యం జరిగినట్లు వివరించింది. హాజరు వివరాలను పరిశీలించిన అనంతరం అర్హత మేరకు బిల్లులను విడుదల చేస్తున్నామని తెలిపింది. జలమండలి నుంచి బిల్లులు విడుదలైన అనంతరం సంబంధిత ఏజెన్సీలు మీటర్ రీడర్లకు జీతాలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.అందువల్ల మీటర్ రీడర్లను తొలగిస్తున్నారని, వారి జీతాలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని జలమండలి మరోసారి స్పష్టం చేసింది.మీటర్ రీడర్ల సమస్యలపై జలమండలి సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందని, ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, మంగళవారం జరిగే సమావేశంలో ఈ అంశంపై తదుపరి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలిపింది.ఈ అంశంపై అనవసర పుకార్లు, అపోహలు నమ్మకుండా అధికారిక సమాచారాన్నే పరిగణనలోకి తీసుకోవాలని జలమండలి విజ్ఞప్తి చేసింది.

# మిద్దె తోటలు-పర్యావరణ పరిరక్షణకు ప్రజా ఉద్యమం

## నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో సి టి జి ఆధ్వర్యంలో 700 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 12(ప్రభాత ఉదయం)**

నగరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రతి ఇంటినీ ఒక చిన్న పట్టణ రైతుగా గా మార్చడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగాటెర్రేస్ గార్డెన్స్ నగరం ఆధ్వర్యంలో శనివారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రత్యేక పర్యావరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 700 మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, వివిధ రకాల కూరగాయ మొక్కలు, పూల మొక్కలు, సుగంధ ఉపయోగకరమైన మొక్కలను సి టి జి సభ్యులకు అందజేశారు.

**"ప్రతి ఇంటా మిద్దె తోట -- ఇంటింటా ఇంకుడు గుంట"**

నగర జీవన విధానంలో పచ్చదనం, స్వచ్ఛమైన ఆహారం, వర్షపు నీటి సంరక్షణ మరియు భూగర్భ జలాల పునరుద్ధరణను ఒకే ప్రజా ఉద్యమంగా తీసుకెళ్లాలన్న సి టి జి సంకల్పాన్ని కార్యక్రమంలో వివరించారు.అర్బన్ ఫార్మింగ్‌కు హార్టికల్చర్ యూనివర్సిటీ సహకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. రాజి రెడ్డి నగరాల్లోపట్టణ వ్యవసాయం అవసరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.కాంక్రీట్ నగరాల్లో కూడా ప్రతి ఇంటి మిద్దెను, బాల్కనీని, అందుబాటులో ఉన్న చిన్న స్థలాన్ని పచ్చని ఉత్పాదక ప్రదేశంగా మార్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.మిద్దె తోటల ద్వారా కుటుంబాలకు తాజా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు అందించడంతో పాటు, నగరాల్లో పచ్చదనం పెంచడం, పర్యావరణ సమతుల్యతను మెరుగుపరచడం సాధ్యమవుతుందని తెలిపారు.అర్బన్ ఫార్మింగ్‌ను విస్తృతంగా ప్రోత్సహించేందుకు హార్టికల్చర్ యూనివర్సిటీ తరఫున అవసరమైన సాంకేతిక సహాయం మరియు సహకారం అందిస్తామని డా. రాజి రెడ్డి హామీ ఇచ్చారు.

**హెచ్ఎండిఏ నుంచి మొక్కల సహకారం**

హెచ్ఎండిఏ మేనేజర్ వి జి సుందర్ హెచ్ఎండిఏ ద్వారా చేపడుతున్న వివిధ పచ్చదనం, పట్టణ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను వివరించారు. సిటిజి సభ్యుల మిద్దె తోటల కార్యక్రమాన్ని అభినందించిన ఆయన, ఈ కార్యక్రమానికి అవసరమైన మొక్కల సహకారం అందించడంలో హెచ్ఎండిఏ తరఫున తన వంతు సహకారం కొనసాగిస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన కరివేపాకు, గోరింటాకు మొక్కలతో పాటు వివిధ రకాల పుష్పించే మొక్కలను సిటిజి సభ్యులకు అందజేశారు.

**మట్టి వినాయకుడు -- పర్యావరణానికి మిత్రుడు**

రసాయన రంగులతో తయారు చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించాల్సిన అవసరాన్ని సి టి జి ప్రతినిధులు వివరించారు.పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, ప్రకృతికి హాని కలగకుండా జరుపుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు పేర్కొన్నారు.

"భక్తి ఉండాలి --- ప్రకృతిపై బాధ్యత కూడా ఉండాలి" అనే సందేశంతో సి టి జి ఈ మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది.

**ఒక కార్యక్రమం కాదు --- ఒక ఉద్యమం**

సిటిజి ప్రతినిధులు మాట్లాడుతూ, నగరాల్లో పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా ప్రతి కుటుంబం యొక్క రోజువారీ జీవన విధానంలో భాగంగా మార్చడమే తమ లక్ష్యమని తెలిపారు.ప్రతి ఇంటిలో కనీసం కొన్ని కూరగాయలు, ఆకుకూరలు, పూలు లేదా ఉపయోగకరమైన మొక్కలను పెంచడం ద్వారా లి"ప్రతి ఇంటా మిద్దె తోట"లిను సాధించవచ్చని, అదే విధంగా ప్రతి ఇంటి వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే విధంగా "ఇంటింటా ఇంకుడు గుంట" కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సిటిజి పిలుపు ఒక్క ఇంటితో ప్రారంభిద్దాం. ప్రతి ఇంటికీ తీసుకెళ్దాం.



# గద్వాలలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

## శ్రీ లక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్ టీచర్లు స్రవంతిద్రాక్షాయణికి అవార్డులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(ప్రభాత ఉదయం)**

జిల్లా ప్రైవేట్ స్కూల్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి శ్రీ లక్ష్మీ కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయురాళ్లు స్రవంతి, ద్రాక్షాయణి ఎంపికయ్యారు. ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా వారు పురస్కారాలు అందుకున్నారు.విద్యార్థుల్లో విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలను పెంపొందించడంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలు స్రవంతి మాట్లాడుతూ... తనను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యతతో పనిచేసే శక్తినిచ్చిందని, భవిష్యత్తులో విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.ఉత్తమ ఉపాధ్యాయురాలు ద్రాక్షాయణి మాట్లాడుతూ ఈ పురస్కారానికి ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు అండగా నిలిచిన పాఠశాల యాజమాన్యానికి, తోటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మరింత కృషి చేస్తానని, ఈ అవార్డు తనకు మరింత స్ఫూర్తినిచ్చిందని తెలిపారు.




# సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు పోరాటాలు చేద్దాం.

## ఘనంగా సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి.


**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(ప్రభాత ఉదయం)**

సిపిఐ ఎం పార్టీ మాజీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి జోగులాంబ గద్వాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సీతారాం ఏచూరి ఉన్నత చదువులు చదువుకుని పేద ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేశారని, విద్యార్థి దశ నుండే పోరాటాల వైపు ఆకర్షితుడై విద్యార్థుల సమస్యలపై గళమెత్తారని, విద్యార్థి నాయకుడి నుండి సిపిఐ ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారని అన్నారు. పార్లమెంటు, రాజ్యసభలో దేశంలోని అనేక సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజల తరపున పోరాడారని గుర్తు చేశారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు.నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలి రాజకీయ స్వలాభం కోసం పనిచేస్తున్నాయని ఒకవైపు కుల మత రాజకీయాలతో ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టిస్తూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో రైతాంగం పూర్తిగా అప్పుల పాలు అవుతోందని కరెంటు సక్రమంగా వేసిన పంటలు కూడ ఎండుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం కార్యకర్తలు పోరాడాలని సమస్యల సాధన కోసం జరిగే ఉద్యమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నరసింహ, నాయకులు గజేంద్ర, బాలరాజు, బాబన్న,అశోక్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి సహకారం.. బండి రమేష్ చొరవతో

# రూ.3.32 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

## కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులను భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా లభించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సహకారం, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి రమేష్ చొరవతో బోయినపల్లి సర్కిల్ పరిధికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.3,32,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ బోయినపల్లి సర్కిల్ పరిధికి చెందిన పలువురు బాధితులు కూకట్‌పల్లిలోని హేమదుర్గ భవన్‌లో ఉన్న బండి రమేష్ కార్యాలయాన్ని సంప్రదించారు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్న బండి రమేష్, లబ్ధిదారుల విజ్ఞప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్నారు.

**ఆరుగురు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, బండి రమేష్ కృషి ఫలితంగా మంజూరైన చెక్కులను శనివారం హేమదుర్గ భవన్‌లోని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారుల వివరాల ప్రకారం

పొట్టేటి గౌతమి, కేర్ ఆఫ్ పొట్టేటి రవీందర్ రూ.60,000, గౌసియా బేగం, కుమార్తె మొహమ్మద్ దస్తగిరి --- రూ.50,000, తమ్మిరి కృష్ణవేణి, కేర్ ఆఫ్ రామాచారి --- రూ.60,000, దేవుళ్ల నీలం రాజు, కుమారుడు దేవుళ్ల ప్రకాష్ --- రూ.60,000, కడిపప్పుల్ ఫ్రాన్సిస్, కుమారుడు వెంకట రత్నం --- రూ.42,500, మండల చంద్రకళ, కేర్ ఆఫ్ రామిరెడ్డి --- రూ.60,000, కష్టకాలంలో సీఎంఆర్ఎఫ్ అండ ప్రభుత్వ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన బండి రమేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలవడం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, నాగార్జున, శివ చౌదరి, నలినీ కాంత్, వరుణ్, జహంగీర్, సజ్జన్, సంధ్య, జోజమ్మ, కల్పన, రజిని, మారుతి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రీయ హిందీ దివస్ ఘనంగా నిర్వహణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 12 (ప్రభాత ఉదయం):**

రాష్ట్రీయ హిందీ దివస్ సందర్భంగా హిందీ ప్రేమ మండలి, కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రణామ్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్, జెడ్పీ క్వార్టర్స్‌లో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మైదం శివకాంత్ పటేల్, కోల అన్నారెడ్డి,పెద్ది విద్యాసాగర్, ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్, సింగమ రాజు తదితర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ అధ్యక్షులు ఎం. అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు హిందీ భాష యొక్క గొప్పతనం, ప్రాధాన్యత మరియు సాహిత్య విలువలను వివరించారు. జాతీయ సమైక్యతలో హిందీ భాష పోషిస్తున్న కీలక పాత్రను వారు కొనియాడారు.ఈ సందర్భంగా ప్రముఖ కవి సబ్బని లక్ష్మీనారాయణ రచించిన మౌన సముద్రం' కవితా సంకలనాన్ని హిందీలోకి అనువదించిన సందర్భంగా పుస్తకాన్ని వేదికపై ఉన్న ప్రముఖులు ఆవిష్కరించారు.అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 50 మందికి పైగా హిందీ పండితులు, హిందీ ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారికి ప్రశంసాపత్రాలు, శాలువాలు అందజేసి హిందీ భాష, సాహిత్యం మరియు విద్యా రంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో బోయినపల్లి హనుమంతరావు, చింతల సత్యనారాయణ, కేశవరెడ్డి, ప్రొఫెసర్ వాసాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.హిందీ ఉపాధ్యాయులు ఉమర్ అలీ, ఎం. భారతి, విజయలక్ష్మి, యోగా సంపత్, బాల్ రెడ్డి, నుజెట్టి రవీంద్రనాథ్, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.హిందీ భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న పండితులు మరియు ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సేవా కార్యక్రమాలతో పాటు విద్యా, భాషా మరియు సాహిత్య రంగాల్లో కూడా తన సేవా స్ఫూర్తిని కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు.



# అశోక్ నగర్‌లో తీరిన తాగునీటి కష్టాలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 12 (ప్రభాత ఉదయం):**

నగరంలోని 54వ డివిజన్ అశోక్ నగర్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసుల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నూతన బోరును శనివారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.కాలనీలో తీవ్రంగా నెలకొన్న నీటి ఎద్దడిని గుర్తించిన 54వ డివిజన్ కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ ప్రత్యేక చొరవ తీసుకుని నూతన బోరును వేయించారు. బోరు ద్వారా నీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కోసం కరెంటు మీటర్‌ను సైతం ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, ముఖ్యంగా తాగునీటి సమస్యలను పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత అని అన్నారు. నగరంలోని ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్యలు ఉంటే వాటిని గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు నూతన బోరు ఏర్పాటుతో పరిష్కారం లభించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి బోరు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణకు కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్, రమేష్, అరుణ్, శ్రీనివాస్, గండి గణేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్ట్‌లతో ప్రశ్నించే గొంతుకలను అడ్డుకోలేరు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 12 (ప్రభాత ఉదయం):**




జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ గారిని గృహనిర్బంధం చేసి ఉదయం 6.30 గం " లకు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు , ఈ అక్రమ అరెస్ట్ లను కండిస్తున్నామని పొన్నం అనిల్ కుమార్ గౌడ్ అన్నారు , రేవంత్ రెడ్డి తెల్లవారి లేచేసరికి రాష్ట్ర వ్యాప్తంగా బి ఆర్ ఎస్ వి అనే కెసిఆర్ గులాబీ సైన్యాన్ని అరెస్ట్ చేయాలని హుకుం జారీ చేసినట్లున్నారు , ఈ పోలీస్ లు ఎలాంటి కారణం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం అంటే అర్ధ రాత్రి కలలో కూడా రేవంత్ రెడ్డి సీఎం కి బిఆర్యెస్వి నాయకులు మాత్రమే కనపడుతున్నారు. ఈ నియంత పాలన కు చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని ఇక ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

# చివరి మజిలీ పనులకు వేళైంది..

## అంజయ్య నగర్ శ్మశానవాటిక రూపురేఖలు మారబోతున్నాయి!

**రూ. 1.80 కోట్లతో కొండాపూర్, మాదాపూర్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 12, (ప్రభాత ఉదయం)**

కాలనీల స్వరూపాన్ని మారుస్తూ ప్రజలకు అవసరమైన మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని పీఏసీ చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఎన్నో రోజులుగా వేచి చూస్తున్న అంజయ్య నగర్ హిందూ శ్మశానవాటిక ఆధునీకరణతో పాటు పలు కీలక అభివృద్ధి పనులకు శనివారం ఆయన స్థానిక నాయకులు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అంజయ్య నగర్ కాలనీలోని హిందూ శ్మశానవాటికను సకల సదుపాయాలతో మోడల్ వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు రూ.1.53 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న పనులకు భూమిపూజ చేశారు. హైటెక్ సిటీ డివిజన్ మాదాపూర్ డాక్టర్స్ కాలనీలో రూ.27 లక్షల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణం వరద నీటి కాలువ (స్టార్మ్‌వాటర్ డ్రైన్) పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ, వరద నీటి కాలువల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్న మన్నారు. చివరి మజిలీకి తగిన గౌరవం దక్కేలా అంజయ్య నగర్ స్మశానవాటికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యలను నిరంతరం అధికారుల దృష్టికి తీసుకెళ్తూ, పనులను వేగవంతంగా పూర్తి చేయించడమే



అంజయ్య నగర్ శశ్మానవాటిక పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తో పాటు నాయకులు..

లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు షేక్ హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, నీలం రవీందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఊట్ల దశరథ్, ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, మోడల నరసింహ సాగర్, ఆంజనేయులు సాగర్, షేక్ చాంద్ పాషా, ముత్తోజు విక్రమ్ చారీ, కాలే బసవరాజు, పంతం గణపతి, స్థానిక ప్రజలు, అధికారులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**రూ 4.06 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు, సెప్టెంబర్ ( ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడంతో పాటు.. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు, జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్ల పరిధిలో నాలుగు కోట్ల ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, దేవ్ ప్రైమ్ విలాస్ కాలనీలలో రక్షిత మంచినీటి సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి కాలనీకి స్వచ్ఛమైన, రక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, కుమార్ గౌడ్, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, సందీప్, రామకృష్ణ, అంజాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## కార్యనిర్వహణ చైర్మన్‌గా ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 12 (ప్రభాత ఉదయం):**



మండలి తాత్కాలిక కార్యనిర్వాహణ చైర్మన్ గా ఎమ్మెల్సీ భాను ప్రసాదరావు కు అవకాశం దక్కింది. తెలంగాణ శాసన మండలి సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రంలో మోస్ట్ సీనియర్ సభ్యులుగా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్ రావు కార్యనిర్వాహణ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తానిపర్తి భానుప్రసాద్ రావు కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన మొదట కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి, 2009లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత గులాబీ పార్టీలో కొనసాగి ఫిబ్రవరి 2023లో శాసనమండలి చీఫ్ విప్‌గా నియమితులయ్యారు. జూలై 2024లో ఆయన తిరిగి భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరారు.



## వినాయక అగమన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ పరిలోని ఎల్లమ్మబండ కురుమ సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక అగమన కార్యక్రమంలో కాంగ్రెస్ సినియర్ నాయకులు జిల్లా గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ వినాయక నవరాత్రులు సందర్బంగా నిర్వహించిన కార్యక్రమంలో అగమన ఊరేగింపులో నన్ను ముఖ్య అతిధిగా పిలవడం ఆనందంగా ఉందని, అలాగే నవరాత్రులు పండుగ అనందంగా జరుపుకోవాలని, వినాయక కృప మన అందరిపైన ఉండి సుఖసంతోషాలతో ఆనందంగా వుండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంగం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## రాష్ట్రీయ హిందీ దివస్ ఘనంగా నిర్వహణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 12 (ప్రభాత ఉదయం):**

రాష్ట్రీయ హిందీ దివస్ సందర్భంగా హిందీ ప్రేమ మండలి, కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రణామ్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్, జెడ్పీ క్వార్టర్స్‌లో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మైదం శివకాంత్ పటేల్, కోల అన్నారెడ్డి, పెద్ది విద్యాసాగర్, ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్, సింగమ రాజు తదితర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ అధ్యక్షులు ఎం. అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు హిందీ భాష యొక్క గొప్పతనం, ప్రాధాన్యత మరియు సాహిత్య విలువలను వివరించారు. జాతీయ సమైక్యతలో హిందీ భాష పోషిస్తున్న కీలక పాత్రను వారు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి సబ్బని లక్ష్మీనారాయణ రచించిన మౌన సముద్రం' కవితా సంకలనాన్ని హిందీలోకి అనువదించిన సందర్భంగా పుస్తకాన్ని వేదికపై ఉన్న ప్రముఖులు ఆవిష్కరించారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 50 మందికి పైగా హిందీ పండితులు, హిందీ ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారికి ప్రశంసాపత్రాలు, శాలువాలు అందజేసి హిందీ భాష, సాహిత్యం మరియు విద్యా రంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి హనుమంతరావు, చింతల సత్యనారాయణ, కేశవరెడ్డి, ప్రొఫెసర్ వాసాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. హిందీ ఉపాధ్యాయులు ఉమర్ అలీ, ఎం. భారతి, విజయలక్ష్మి, యోగా సంపత్, బాల్ రెడ్డి, నుజెట్టి రవీంద్రనాథ్, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు. హిందీ భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న పండితులు మరియు ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సేవా కార్యక్రమాలతో పాటు విద్యా, భాషా మరియు సాహిత్య రంగాల్లో కూడా తన సేవా స్ఫూర్తిని కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు.



## లోక్ అదాలత్‌లో 8,486 కేసుల శాశ్వత పరిష్కారం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12 ( ప్రభాత ఉదయం)**


కక్షిదారుల వివాదాలకు లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని, వారికి సమయం, డబ్బు ఆదా అవుతుందని గద్వాల కోర్టు జిల్లా న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గద్వాల జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాలను నిర్వహించి కక్షిదారులు పరస్పర సమ్మతితో దావాలను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ నేపథ్యంలో గద్వాల కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్ భవన్‌లో జిల్లా న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి లాంఛనంగా లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. లోక్ అదాలత్ ద్వార 8,486 కేసులను పరిష్కరించినట్లు ,ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు 8,459,సివిల్ కేసులు 27,సైబర్ క్రైమ్ కేసులు 09,బ్యాంకు లిటిగేషన్ కేసులు 10,మోటారు వాహన ప్రమాద కేసులు 02, తదితర పెండింగ్ కేసుల్లో ఇరుపక్షాల (కక్షిదారుల) సమ్మతితో రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు, దీని ద్వారా మొత్తం రూ. 1,43,60,970 పరిష్కరించబడిందని న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోక్సో న్యాయమూర్తి వి. శ్రీనివాస్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ. నాగరాజు, కార్యదర్శి జి. నిష్పా పాత్రుడు, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్గా, గద్వాల డీఎస్పీ మొగులయ్య, న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయశాఖ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానస్పద మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణంలో తెలుగు నరేందర్(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన తెలుగు నరేందర్ (38) అనే వ్యక్తి గద్వాలలో సత్యసాయి స్కూల్ సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. సంవత్సరం క్రితం గద్వాలలోని ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తుండే వాడు. అనంతరం జాబ్ మానేశాడు. తెలుగు నరేందర్ గద్వాల జిల్లాకు చెందిన ఒక మహిళతో వివాహం జరిగింది. కొన్ని అని వార్యకారణాల వల్ల భార్య మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో విడాకులు ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల మృతుడిని తల్లి మృతి చెందడంతో మానసిక ఆవేధనకు గురై.. మద్యానికి బానిసయ్యాడు. గత నాలుగురోజుల నుంచి ఇంట్లోనే ఉంటున్న నరేందర్ మృతి చెందాడు. ఈక్రమంలో శనివారం మృతుని ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు గద్వాల టౌన్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే కట్టుకున్న భార్య దూరం అవగా, కన్న తల్లి మృతి చెందడంతో అనాథగా మారిన నరేందర్ డిప్రెషన్ కు లోనై మద్యానికి బానిసై, అనారోగ్యంతో మృతి చెందడం పలువురిని కంటతడి పెట్టించింది.




## ఎస్ఐఆర్ స్పెషల్ క్యాంపెయిన్ డే నోటీసుల విచారణ పరిశీలించిన అదనపు కలెక్టర్

**జడ్చర్ల, సెప్టెంబర్ 12 (ప్రభాత ఉదయం)**

జడ్చర్ల లో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే నోటీసుల విచారణ ప్రక్రియను అదనపు కలెక్టర్ (రెవిన్యూ) హరిప్రియ పరిశీలించారు. జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి, గంగాపూర్ గ్రామాల్లోని 121, 122, 123 పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన డాక్యుమెంట్ల వ్యత్యాసాలు, నో మ్యాపింగ్ నమోదులను పరిశీలించి, వాటికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసుల విచారణలో నిబంధనల ప్రకారం ఆధారాలను పరిశీలించి, అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విచారణ ప్రక్రియ ఎలా కొనసాగుతోంది, ఓటర్ల నుంచి అందుతున్న వివరాలు, అభ్యంతరాలు తదితర అంశాలపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నర్సింగ్ రావు, డిప్యూటీ తహసిల్దార్, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608